# ఆందోళన వీడితే.. విజయం మీదే



వి. వినయ్ చంద్
ఐఏఎస్, అసిస్టెంట్ కలెక్టర్, వరంగల్

**అందరూ నన్ను చూసి నవ్వుతారు.. ఎందుకంటే నేను వారికి భిన్నం! కానీ నేను మాత్రం వాళ్లందరినీ చూసి నవ్వుతాను.. కారణం వారందరూ ఒకటేనని!! - అల్బర్ట్ ఐన్‌స్టీన్**

మూడు దశల్లో జరిగే సివిల్స్ సర్వీసెస్ ప్రిపరేషన్ విషయంలో ఈ మాటలు అక్షర సత్యాలు. ముఖ్యంగా ప్రిలిమ్స్ ఎంతో ప్రధానం. తర్వాత దశలకు వీసా వంటిది ఈ పరీక్ష. ఈ నేపథ్యంలో.. ఈ పరీక్ష గురించి ఎన్నో అపోహలు! ముందుగా వాటిని నివృత్తి చేసుకోవడం ప్రధానం.. అవి..

- **సిలబస్ అపరిమితం.. విస్తృతం** అనేది ప్రధానమైన అభిప్రాయం. సిలబస్‌ను నిర్దిష్టంగా నోటిఫికేషన్‌లో పేర్కొంటారు. ప్రిపరేషన్ సమయంలో సిలబస్ కాపీని ఎప్పుడూ దగ్గర ఉంచుకోవాలి.
- **'ఏ ఒక్క మెటీరియల్ మీదనో ఆధారపడలేం'** అనేది వాస్తవమే. చాలా విషయాలు చదవాల్సి ఉన్నందున కేవలం ఒక పుస్తకంలోనే వాటిని పొందడం సాధ్యం కాదు.
- **ప్రతి అంశాన్ని గుర్తుంచుకోవడం కష్టం!** ఇదీ నిజమే.. సదరు అంశానికి సంబంధించి నిర్దేశిత సమాచారం మాత్రమే అవసరం అనుకున్నప్పుడు.. మార్కెట్లో లభించే అన్ని పుస్తకాలను చదవాల్సిన అవసరం లేదు.
- ప్రస్తుత నోటిఫికేషన్ నేపథ్యంలో.. అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సమయంలో జనవరి నుంచి వంద రోజులు సిలబస్‌ను ఆసాంతం చదవడానికి.. తర్వాత 50 రోజులు ప్రాక్టీస్ టెస్ట్‌లకు కేటాయించాలి.
- రోజుకి 14 నుంచి 15 గంటలు చదవాలని.. కంబైన్డ్ స్టడీ చేయాలని.. భావిస్తారు. ఎంతసేపు చదివాం అనేదాని కంటే.. ఎంత ఏకాగ్రతతో చదివాం? ఎంత అర్థం చేసుకున్నాం? అనేదే ముఖ్యం.

## ప్రిపరేషన్‌లో ఏడడుగులు:

- ప్రతి సబ్జెక్టులోనూ గత ప్రశ్నపత్రాలను చదవడంతోపాటు ముఖ్యమైన అంశాలతో సంక్షిప్త నోట్స్ రూపొందించుకోవాలి.
- ప్రతి చాప్టర్ వెనుక ఉన్న ప్రశ్నల్ని చదవాలి.
- ప్రతి సబ్జెక్టుకు సంబంధించి పదజాలంతో ఓ నోట్స్ రూపొందించుకోవాలి.
- ప్రతిరోజూ చదివే సమయంలో 30 శాతాన్ని రివిజన్‌కు కేటాయించాలి.
- ప్రతిరోజూ ప్రాక్టీస్ టెస్ట్ చేయాలి. కనీసం రోజుకి 20 ప్రశ్నలకైనా సాధన చేయాలి.
- సమకాలీన అంశాలపై దినపత్రికల ద్వారా క్రమం తప్పకుండా అవగాహన సాధించాలి.

SAKSHI

- ఆరోగ్య సంరక్షణ కూడా ముఖ్యమే. ఇందుకోసం గంటసేపు యోగా సాధనచేయాలి. కచ్చితంగా ఏడు గంటలు నిద్రకు కేటాయించాలి. మిగతా 16 గంటల్లో అధిక శాతం ప్రిపరేషన్‌కు కేటాయించాలి.

## సబ్జెక్టు వారీగా ముఖ్యమైన అంశాలు:

**జాగ్రఫీ:** ఫ్యాక్ట్స్, కాన్సెప్ట్ క్షుణ్నంగా చదవాలి. పాత ప్రశ్నల ఆధారంగా మ్యాప్ పాయింటింగ్ ప్రాక్టీస్ చేయాలి. జనాభా, సెన్సస్, వనరులు, వాతావరణం, ఆయా సంస్థలపై సమాచారం పుక్కిట పట్టాలి. ఈ విభాగం నుంచి దాదాపు 25 నుంచి 30 ప్రశ్నలు అడిగే అవకాశాలుంటాయి.

**పాలిటీ:** ఇందులోంచి పది నుంచి 12 ప్రశ్నలు ఆశించవచ్చు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్,షెడ్యూల్స్, సవరణలు.. రాజ్యాంగ సంస్థలు, నియామకాలు-అర్హతలు, ప్రజా ప్రాముఖ్యానికి సంబంధించి ముఖ్యమైన అంశాల అవగాహన అవసరం.

**ఎకానమీ:** బడ్జెట్, బడ్జెట్ అంశాలు, సూచీలు, ప్రభుత్వ పథకాలు, ఆహార ఉత్పత్తుల గణాంకాలు, పారిశ్రామిక ఉత్పత్తి, విదేశీ మారకం, చెల్లింపుల శేషం, పంచవర్ష ప్రణాళికలు.. ఈ విభాగంలో బాగా చదవాల్సిన అంశాలు. ఆర్థిక పదజాలం, ప్రాథమిక భావాల కోసం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల అధ్యయనం లాభిస్తుంది. మొత్తం మీద ఈ విభాగం నుంచి 10 నుంచి 15 ప్రశ్నలు రావచ్చు.

**హిస్టరీ:** పురాతన, మధ్యయుగ, ఆధునిక చరిత్ర చదవాలి. భారత చరిత్ర కాల గమనం; యుద్ధాలు-సంవత్సరాలు; చారిత్రక కట్టడాలు; సంస్కృతి; కవులు-వారు చేసిన సాహిత్య సేవలు, వారికి రాజులు అందించిన ప్రోత్సాహం; ముఖ్యమైన సిద్ధాంతాలు. ఈ విభాగం నుంచి 20 నుంచి 25 ప్రశ్నలు ఆశించవచ్చు.

**కరెంట్ ఈవెంట్స్:** ముఖ్యమైన సదస్సులు-వేదికలు; అవార్డులు; ముఖ్యమైన సంక్షోభాలు; భారత్-విదేశీ సంబంధాలు; ప్రధాని పర్యటనలు- ప్రపంచ దేశాలతో చేసుకున్న ఒప్పందాలు; ముఖ్యమైన ఆటల పోటీలు- విజేతలు, పరాజితులు; ప్రపంచ రికార్డులు; నోబెల్ ప్రైజ్‌లు; సాహిత్య అవార్డులు; ప్రముఖ పుస్తకాలు. అన్ని విభాగాలతో పోల్చితే ఈ విభాగం నుంచి అధికంగా 30 నుంచి 40 ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

**సైన్స్ అండ్ టెక్నాలజీ:** బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీలోని ప్రాథమిక అంశాలు; కొత్త ఆవిష్కరణలు; పర్యావరణ సంబంధ అంశాలు; ఆయా సంస్థలు; సదస్సులు; కొత్త టెక్నాలజీలు (ఉదా: నానో టెక్నాలజీ, బయోటెక్నాలజీ, జెనెటిక్ ఇంజనీరింగ్). పది నుంచి పదిహేను ప్రశ్నలడిగే అవకాశం ఉన్న ఈ విభాగం కోసం 8, 9, 10వ తరగతి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేయాలి.

**మెంటల్ ఎబిలిటీ:** లాజిక్; డేటా ఇంటర్‌ప్రిటేషన్; బేసిక్ అర్థమెటిక్. ప్రశ్నలన్నీ సాధారణ గణనపైనే ఆధారపడి ఉంటాయి కాబట్టి ఈ విభాగం కోసం తీవ్రంగా శ్రమించక్కర్లేదు. ఇందులో 10 నుంచి 15 ప్రశ్నలు ఆశించవచ్చు.

SAKSHI

## చదవాల్సిన మెటీరియల్:

- 8 నుంచి 12 వ తరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు
- ఇండియా ఇయర్ బుక్
- పాత ప్రశ్న పత్రాలు
- స్టాండర్డ్ అట్లాస్
- సమకాలీన అంశాల విశ్లేషణలు
- స్పెక్ట్రమ్ ప్రిలిమ్స్ బుక్స్
- మనోరమ ఇయర్ బుక్

**ప్రతి ఒక్కరి జీవితంలో మార్పు తప్పనిసరి. అలాంటప్పుడు.. ఆ మార్పు మన ఉన్నతికి దోహదపడేలా యత్నించాలి. కృషి, క్రమబద్ధమైన శైలితో కదలాలి. వెయ్యి మైళ్ల ప్రయాణం మొదలయ్యేది కూడా ఒక్క అడుగుతోనే.**

ఆత్మ విశ్వాసంతో.. ఉన్నతమైన ఆలోచనలతో అడుగులు వేయండి. విజయం ఖాయం..

**ఆల్ ద బెస్ట్!!**

SAKSHI